నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 నిజామాబాద్, బుధవారం 19 మార్చి 2025 ADILABAD NIRMAL



సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం

# సీసీఐ కోసం ఉద్యమం


- సాధన కమిటీ ఆధ్వర్యంలో నేటి నుంచి ఆందోళనలు
- కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు
- కేంద్రం నిధులు కేటాయించాలని డిమాండ్

ఆదిలాబాద్, మార్చి 18(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను తిరిగి ప్రారంభించాలంటూ జిల్లాలో నేటి(బుధవారం) నుంచి మరో ఉద్యమం ప్రారంభంకానుంది. గతంలో సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం కోసం ఆందోళనలు చేపట్టిన సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. మంగళవారం సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పరిశ్రమ సాధన కోసం మరో ఉద్యమం చేయాలని నిర్ణయించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లో సీసీఐ పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించినా జిల్లా అభివృద్ధి కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం విచారకమని పేర్కొన్నారు. ఐదు వేల మందికి ఉపాధి కల్పించే సీసీఐని తిరిగి ప్రారంభించాలని జిల్లావాసులు ఆందోళనలు చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి పరిశ్రమను తుక్కు కింద అమ్మేయడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్ విజ్జిగిరి నారాయణ, వెంకట్ నారాయణ, లంక రాఘవులు, అరుణ్‌కుమార్, లోకారి పోశెట్టి, జగన్ సింగ్, ఈశ్వర్‌దాస్ పాల్గొన్నారు.

### ఈ సమావేశాల్లో నిధులు కేటాయించాలి..



నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. నేటి(బుధవారం) నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నాం. ఈ దీక్షలకు వివిధ రాజకీయ పార్టీలతోపాటు అందరు మద్దతు ప్రకటించాలని కోరుతున్నాం. కేంద్ర ప్రభుత్వం సీసీఐని పునః ప్రారంభించాల్సింది పోయి తుక్కు కింద విక్రయించడానికి ఈ టెండర్లు పిలిచారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. జిల్లా ప్రజలు బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించారు. జిల్లా ప్రజల రుణం తీర్చుకోవాల్సిన అవసరం వారికి ఉంది.
**- దర్శనాల మల్లేశ్, సీసీఐ సాధన కమిటీ కన్వీనర్**



నిర్మల్ మండలంలోని చిట్యాలలో తాళం వేసి ఉన్న రైతు వేదిక

# రైతు వేదికలకు తాళం

- ప్రస్తుతం నిర్వహణ కోసం నిధులివ్వని కాంగ్రెస్ సర్కారు

### నిర్మల్ జిల్లాలో పలుచోట్ల నిరుపయోగంగా భవనాలు

### ఆఫీసర్లు అచ్చుడు తక్కువైంది..



నాకు దిలావర్‌పూర్‌ల ఆరెకరాల భూమి ఉన్నది. మక్క, పసుపు, వరి పండిస్త. ఇంతకు ముందు కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఆఫీసర్లు పొద్దంతా రైతు వేదికల మా కండ్ల ముందే ఉంటుండే. పంటలకు ఏమన్న రోగం అస్తే ఎంటనే పొలం కాడికి అచ్చి చూసెటోళ్లు. మందులు మాకులు ఏస్తే మళ్ల పంట మంచిగ పండేడిది. ఇప్పుడు కాంగ్రెస్ అచ్చిన సంది ఊర్లళ్లకు ఆఫీసర్లు అచ్చుడు తక్కువైంది. ఎప్పుడస్తున్నరో.. ఎప్పుడు పోతున్నరో తెలుస్తలేదు. పంటలకు రోగమొచ్చినా, పూత, కాత రాకున్నా మేమే ఖానాపూర్‌కు పోయి పెద్దాఫీసుల సార్లకు మా బాధలు చెప్పుకుంటున్నం. ఇసుంటి బాధలు మళ్లా అస్తయని అనుకోలే.
**- శనిగారపు రాములు, రైతు, దిలావర్‌పూర్, ఖానాపూర్.**

సూర్యాపూర్ రైతు వేదిక తలుపు విరగ్గొట్టిన ఆకతాయిలు



దిలావర్‌పూర్ రైతు వేదికలో పేరుకుపోయిన చెత్తా చెదారం



### కాంగ్రెస్ వచ్చినంక ఒక్క మీటింగ్ జరగలే..



మా ఊరు గోడలపంపు. దిలావర్‌పూర్ వ్యవసాయ క్లస్టర్ కిందికి వస్తుంది. కేసీఆర్ ప్రభుత్వం దిలావర్‌పూర్‌లో రైతు వేదికను నిర్మించడంతో తామెంతో సంతోషించాం. రైతులు, అధికారుల కోసం అన్ని సదుపాయాలు కల్పించింది. అప్పట్లో వారానికి రెండు సార్లు సమావేశాలు జరిగేవి. ఏ సీజన్‌ల ఏ పంట వేయాలి. ఎప్పుడు ఎరువులు, పురుగు మందులు చల్లాలనే విషయాలను ఆఫీసర్లు చెప్పేటోళ్లు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులతో ఒక్క మీటింగ్ జరగలేదు. రైతు వేదికలోని ఫ్యాన్లను దొంగలు ఎత్తుకుని పోయిన్రు. కుర్చీలు, టేబుళ్లు ఎటు పోయినయో తెల్వదు. తలుపులు పలిగిపోయినయ్. రైతుల కోసం కట్టిన రైతు వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం చేయడం బాధాకరం. రైతులకు అన్ని విధాలుగా కేసీఆరే ప్రభుత్వమే మంచిగుండే.
**- కట్ల రవి, రైతు, గోడలపంపు, ఖానాపూర్ మండలం**

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా తాళం వేసి కనిపిస్తున్నాయి. క్లస్టర్ల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి సాగుపై అవగాహన కల్పించేందుకు ఈ వేదికలు ఉపయోగపడ్డాయి. ఒక్కో వేదిక నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.22 లక్షలు వెచ్చించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 15 నెలలు గడుస్తున్నా నిర్వహణకు నయా పైసా మంజూరు చేయలేదు.

నిర్మల్, మార్చి 18(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 79 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో 79 రైతు వేదికలు ఉన్నాయి. అలాగే వీటి నిర్వహణ కోసం నిధులను కూడా కేసీఆర్ సర్కారు మంజూరు చేసింది. దీంతో వానకాలం, యాసంగి పంటల సీజన్‌లలో రైతులతో కళకళలాడేవి. అక్కడే ఏఈవోకు కూడా ప్రత్యేకంగా గదిని కేటాయించడంతో వ్యవసాయాధికారులు, రైతుల రాకపోకలతో సందడిగా ఉండేవి. రైతులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా మారాయి. కానీ.. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో నిర్వహణ లేక కళావిహీనంగా మారాయి. ఏఈవోలు కూడా కన్నెత్తి చూడడం లేదు. చాలా చోట్ల దుమ్ము పట్టి పోయాయి. అత్యవసరమైతే పంచాయతీల్లోనే కొద్ది మంది రైతులతో ఏఈవోలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో సోమవారం రైతు వేదికల్లో కాకుండా పంచాయతీలోనే వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇక్కడి గ్రామంలోని రైతు వేదిక నిర్మించినప్పుడు ఎనిమిది ఫ్యాన్లు ఏర్పాటు చేయగా.. ఆరు ఫ్యాన్లను దొంగలు ఎత్తుకెళ్లారని సమాచారం. కనీసం విద్యుత్ సరఫరా లేకపోవడంతో సమావేశాలను గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్నామని ఓ వ్యవసాయాధికారి తెలిపాడు. అన్ని హంగులతో అందుబాటులో ఉన్న రైతు వేదికలు.. ప్రస్తుతం నిర్వహణ లేక కనీసం శుభ్రం చేసి వినియోగించే పరిస్థితి లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

**మూసిన తలుపులు తెరవడం లేదు..**

నిర్మల్ జిల్లాలోని చాలా రైతు వేదికలు తాళం వేసే కనిపిస్తున్నాయి. మూసిన తలుపులు తెరవడం లేదని రైతులు చెబుతున్నారు. ఇటీవల రైతు భరోసా కోసం సర్వే నిర్వహించేందుకు రైతు వేదికలను తెరువగా.. చాలా చోట్ల అపరిశుభ్రమైన పరిసరాలతో అధ్వాన్నంగా కనిపించాయి. ప్రస్తుతం ఏఈవోలు, ఏవోలు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్లిపోతారో? అర్థం కాని పరిస్థితి ఉన్నదని అన్నదాతలు పేర్కొంటున్నారు. ఏఈవోలు పని చేస్తున్నప్పటికీ స్థానికంగా అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రైతు వేదికల నుంచే విధులు నిర్వహించాలని కేసీఆర్ ప్రభుత్వం ఆదేశించడంతో రోజు వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండేవారు. సాగులో తలెత్తే సమస్యలకు పరిష్కార మార్గాన్ని సూచించే వారు. రైతు వేదికల్లో ప్రభుత్వం కనీస వసతులు కల్పించకుండా ఏ విధంగా విధులు నిర్వర్తిస్తామని ఏఈవోలు వాపోతున్నారు. మందుబాబులు, ఇతర కార్యక్రమాలకు అడ్డాగా మారుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అక్రమ కేసులతో అడ్డుకోలేరు

- ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తే అరెస్టు చేస్తారా?
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రెస్‌మీట్


మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీని కాంగ్రెస్ నాయకులు కాల్చుతున్న ఫొటో చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్, మార్చి 18 : రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నించే గొంతుకలను అడ్డుకోలేరని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశామని, పట్టణానికి చెందిన 11 మందిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తే కాంగ్రెస్ నాయకులపై కేసులు ఉండవా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజల తరఫున పోరాటం చేయడం తప్పా అంటూ నిలదీశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు గౌరికర్ రాజు, రాజ గంగన్న, మాజీ జడ్పీటీసీ రాము నాయక్, పార్టీ నాయకులు ప్రదీప్, గజేందర్, సుమీత్, సుమన్, మహేందర్, లాజర్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు

# అంగన్‌వాడీల ధర్నా, వంటావార్పు

### ముగిసిన 48 గంటల ఆందోళన

ఎదులాపురం, మార్చి 18 : అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న 48 గంటల ఆందోళన ముగిసింది. మంగళవారం అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ.. అంగన్వాడీలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పాఠశాలలను ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి. కోశాధికారి మంగ, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, కిరణ్, లింగాల చిన్నన్న, స్వామి పాల్గొన్నారు.

**నిర్మల్‌లో..**

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 18 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న 48 గంటల ధర్నా, వంటావార్పు మంగళవారంముగిసింది.ఈ సందర్భంగా సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఐసీడీఎస్ వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ, భాగ్య, రామలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత, జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా ఉపాధ్యక్షురాలు గంగమణి, రజియా, విజయ, ప్రసాద, భాగ్య, వనజ, జిల్లా సహాయ కార్యదర్శి భాగ్య, రేష్మ, విజయ, వందన, దేవిక, లావణ్య, రమ్య ఉన్నారు.


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

# కవిత పోరాట ఫలితమే బిల్లులు

- తెలంగాణ జాగృతి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఎదులాపురం, మార్చి 18 : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగానే బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం బిల్లులను ప్రవేశపెట్టిందని తెలంగాణ జాగృతి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీల కోసం ఎమ్మెల్సీ చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందని, అందుకు కవితకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ జాగృతి సాధించిన భారీ విజయంగా అభివర్ణించారు. సంపూర్ణంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలయ్యే వరకు తెలంగాణ జాగృతి బీసీలకు అండగా ఉంటుందని తెలిపారు. బిల్లులు పాస్ అవుతున్న కీలక దశలో కేంద్రం మీద ఒత్తిడి పెంచేందుకు బీసీలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నసాయి కృష్ణ, అసపు ప్రమోద్, శ్రీపాద కార్తిక్, శ్రీనివాస్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

# పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 18 : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో పదో తరగతి బోర్డు పరీక్షల నిర్వహణ కోసం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలను అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు పద్మ, లింబాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

**తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి..**

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పన అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కొమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్నారు.